సాక్షి సూర్యాపేట

సోమవారం, 18, సెప్టెంబర్, 2023



ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు
భువనగిరి జిల్లా కేంద్రంలో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి.
- 8లో



పోటెత్తిన భక్తులు
యాదాద్రి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో రద్దీ నెలకొంది.
- 8లో



గుప్త నిధుల కోసం తవ్వకాలు
గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన నూతనకల్ మండలంలో చోటుచేసుకుంది.
- 8లో

న్యూస్‌రీల్

అందరికీ ఏకదంతుడి దీవెనలు అందాలి

- ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు



సూర్యాపేట: ప్రజలంతా సుఖశాంతులతో జీవించేలా.. ఆ ఏకదంతుని దీవెనలు అందాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రార్థించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మంత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి–జ్ఞానానికి ఆరాధ్యుడిగా, ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని పేర్కొన్నారు. ఈ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో సౌభ్రాతృత్వం, సోదరభావం వెల్లివిరిసేలా ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుని దీవెనలతో అధిగమిస్తూ సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలోని శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక . చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సైదమ్మ



నియామకపత్రం అందిస్తున్న శ్రీరాములు

భానుపురి (సూర్యాపేట): టీఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన బొడ్డు సైదమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేటలోని జేజేనగర్‌లో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో బొడ్డు సైదమ్మకు టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేయడంతో పాటు ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, బొడ్డు మల్సూర్, పిడమర్తి మధు, బొల్లె అశోక్, ఎడవెల్లి రాము, ఒగ్గు రవి తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు, యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

అమరుల త్యాగం.. చిరస్మరణీయం

- తెలంగాణ అభివృద్ధి.. దేశానికే తలమానికం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యం చేస్తున్న చిన్నారులు



> తెలంగాణ విముక్తి కోసం పోరాడి అమరులైన మహనీయుల త్యాగం చిరస్మరణీయం. వారి త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో కులమతాలకు అతీతంగా జరుగుతున్న అభివృద్ధి దేశానికే తలమానికంగా మారింది.
> – విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాల భారత దేశంలో అంతర్భాగంగా మారిందన్నారు. తెలంగాణలో గంగా జమునా తెహజీబ్ నడుస్తుందన్నారు. హక్కులు కోసం ఒకటి చేసిన ఆదివాసి యోధుడు కొమురం భీం సాహసం, భూస్వాముల ఆగడాలను ఎదిరించిన దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని, సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట అళ్వార్‌స్వామి, రైతాంగా పోరాటానికి తిరుగులేని నాయకత్వాన్ని అందించిన త్యాగశీలి రావి నారాయణరెడ్డి, వీర వనిత చాకలి ఐలమ్మ, మచ్చలేని మహానాయకుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్, సురవరం ప్రతాప్‌రెడ్డి, ప్రజాకవి కాళోజీ మరెందరో త్యాగుల అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ కోసం పోరాడిన వీర యోధులందరినీ పేరు పేరునా తలచుకోవడం మన కర్తవ్యమన్నారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా ప్రభుత్వం చేస్తున్న ప్రగతి ద్వారా తెలంగాణకు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుతున్నాయని తెలిపారు. ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల, మరెన్నో గురుకుల పాఠశాలు, కళాశాలలు ద్వారా నాణ్యమైన విద్యానందిస్తూ ఉన్నతమైన ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.అన్నపూర్ణ, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపాగాని వెంకట్‌నారాయణ, జెడ్పీటీసీ జీడి భిక్షం, జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ అశోక్, డీఎస్పీ నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా అవార్డులు ప్రదానం

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ–2023 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్వచ్ఛతా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గరిడేపల్లి మండలం పొనుగోడు, మునగాల మండలం గణపవరం, జిల్లా స్థాయిలో ఎంపికైన తుంగతుర్తి మండలం వెంపటి, గానుగుబండ, ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూరు, పాతర్లపహాడ్, చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి, పెన్‌పహాడ్ మండలం అనంతారం, మోతె మండలం సిరికొండ, తుమ్మలపల్లి, మద్దిరాల మండలం రెడ్డిగూడెం, హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం, చిలుకూరు మండలం కొండాపూరం, నడిగూడెం మండలం శ్రీరంగాపురం, కోదాడ మండలం రెడ్లకుంట పంచాయతీలకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం నిర్వహించిన టీచింగ్ లెర్నింగ్ మెటిరియల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించారు. స్వచ్ఛతా హీ సేవ–2023 కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో మంత్రి చేతులు మీదుగా ట్రై సైకిళ్లు, మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లార్డ్ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సమైక్యతా దినోత్సవంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. విద్యార్థులు దేశ భక్తి, తెలంగాణ చరిత్రను తెలిపే పాటలకు చేసిన నృత్యాలను మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి తిలకించారు.



తెలంగాణ జాతీయ సమైక్యతా వేడుకల్లో గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



వేడుకలను తిలకిస్తున్న మంత్రి సతీమణి సునీత, ప్రజాప్రతినిధులు

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే..



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన పోరాటం మూలంగానే ప్రజలకు దోపిడీ, పీడన, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగిందన్నారు. నిజాం పాలనలో భూములన్నీ దొరలు, జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని, వారికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేసిందన్నారు. సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధంలేని బీజేపీ వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి కమ్యూనిస్టుల యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకటరెడ్డి, ఎల్గూరి గోవింద్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు సముచితస్థానం కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు

భానుపురి (సూర్యాపేట): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఊర ముత్యాలమ్మ దేవాలయం ఆవరణలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ కులస్తులకు తగినన్నీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా మహాసభ నిర్వహిస్తామన్నారు. ఇటీవల ప్రకటించిన 115 ఎమ్మెల్యే టికెట్లలో ముదిరాజులకు ఒక టికెట్ కేటాయించకపోవడాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, టికెట్ల కేటాయింపులో మార్పులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు బైరబోయిన శ్రీనివాస్, ఆకుల లవకుశ, దండు రేణుక, నాగరాజు, సైదులు, నగేష్, వెంకటమ్మ, రాజేష్, వీరభద్రం, గుంటి సైదులు, సారగండ్ల కోటేష్, నూకల నాగరాజు, సైదులు, శంకర్, పరమేష్, వీరభద్రయ్య, సిరికొండ శ్రీనివాస్ బోనగిరి భద్రు తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో సమగ్రశిక్షా ఉద్యోగుల దీక్ష



కలెక్టరేట్ వద్ద రోడ్డుపై దీక్ష చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆదివారం సూర్యాపేటలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై మండుటెండలో దీక్ష కొనసాగించారు. గత 17 రోజులుగా కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై టెంట్ వేసుకొని ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. అయితే ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సమైక్యతా దినోత్సవానికి మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నారని పోలీసులు వారి టెంట్‌ను తొలగించారు. దీంతో వారంతా ఎండలోనే తమ దీక్షను కొనసాగించారు. అయితే మంత్రి అక్కడ నుంచి వెళ్లే వరకు దీక్షను విరమించుకోవాలని పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారని ఉద్యోగులు తెలిపారు. అనంతరం మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు, ఉద్యోగులు శ్రీదేవి, అనిత, స్వాతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' లొసుగులతో భూ మాయ

- మ్యుటేషన్‌కాని భూములపై అక్రమార్కుల కన్ను
- అమ్మినవారి పేరుమీదే భూమి ఉందని చూపిస్తున్న పోర్టల్
- గుట్టుచప్పుడు కాకుండా మార్పిడి చేస్తున్న వైనం
- రెవెన్యూ అధికారుల అండదండలతో సాగుతున్న భూ దందా



కోదాడ: ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు దొడ్డిదారిన అమాయకుల భూములను కాజేస్తున్నారు. సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములను మ్యుటేషన్ చేయించుకోని అమాయకులను బురిడీ కొట్టిస్తూ ఈ భూ దందాకు పాల్పడుతున్నారు. ఇందుకు కోదాడ అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. కాసులకు కక్కుర్తి పడిన కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు అండదండలు అందిస్తుండడంతో ఈ దందా ఎక్కువవుతోంది.

బదిలీపై వెళ్తూ.. ఫౌతీ చేసి పోయాడు..

భూమి యజమాని మనవడైన నల్లూరి అంజయ్య ఈ భూమిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దీన్ని పరిశీలించాల్సిందిగా న్యాయస్థానం రెవెన్యూ అధికారులను 2021వ సంవత్సరంలో ఆదేశించింది. దీని పరిశీలించిన కోదాడ తహసీల్దార్ శ్రీనివాసశర్మ సదరు భూమి దాదాపు 37 ఏళ్ల క్రితం డాక్యుమెంట్ నంబర్ 674/1985 ద్వారా అమ్మడంతో దీన్ని వారసులకు అక్కడా భూమి లేదని, ఫౌతీ చేయడం కుదరదని, ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడం వీలు పడదని 04/03/2022న కోదాడ ఆర్డీఓకు నివేదిక ఇచ్చారు. ఇంతలో ఏమైందో ఏమోగాని ఇదే తహసీల్దార్ గత నెలలో తాను బదిలీపై వెళ్తూ.. గతంలో తాను తిరస్కరించిన ఫౌతీ ఫైల్‌ను బయటకు తీసి వారసులకు ఫౌతీ చేయవచ్చని కోదాడ ఆర్డీఓకు 08/07/2023న నివేదిక ఇచ్చారు. దీంతో పాటు మరునాడే దాన్ని వారసుల పేరుతో ఫౌతీ చేశాడు. అదే నెల చివరి వారంలో ఆయన బదిలీపై వెళ్లిపోయారు.

మాకు న్యాయం చేయాలి



> 37 ఏళ్ల క్రితం కొన్న భూమిని ఇప్పుడు దొడ్డిదారిన అమ్మినవారి వారసులకు ఫౌతీ చేశారు. అప్పటి నుంచి ఆ భూమి మీద అనుభవదారులుగా మేమే ఉన్నాం. రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేస్తే వాస్తవం తెలుస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని మాకు న్యాయం చేయాలి.
> – వంకా పుల్లయ్య, తొగర్రాయి

ఫౌతీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం

> 37 ఏళ్ల క్రితం తాము భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. మ్యుటేషన్ చేయించుకోకపోవడంతో సదరు భూమిని ఇతరులకు ఫౌతీ చేశారని అల్లిక లింగయ్య ఫిర్యాదు చేశాడు. దీనిపై వారు కోర్టు ద్వారా తగు ఉత్తర్వులు తీసుకొస్తే వారి పాసుపుస్తకాలను రద్దు చేయడానికి వీలు పడుతుంది.
> – సూర్యనారాయణ, ఆర్డీఓ, కోదాడ

మ్యుటేషన్ కాకుంటే అంతే సంగతులు

అప్పటి కోదాడ తాలూకా తొగర్రాయి గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 167/ఈలో ఎకరం–37 కుంటల భూమిని 04/04/1985న కాపుగల్లు గ్రామానికి చెందిన నల్లూరి సుబ్బయ్య కొడుకులైన రామయ్య, వెంకటయ్యల నుంచి తొగర్రాయి గ్రామానికి చెందిన వంకా కోటయ్య, అల్లిక లింగయ్యలు రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్ 674/1985 ద్వారా కొనుగోలు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు సదరు భూమిలో తానే వ్యవసాయం చేసుకుంటున్నట్లు లింగయ్య చెపుతున్నాడు. కాని భూమిని మ్యుటేషన్ చేయించుకోలేదు. దీంతో ధరణిలో భూమి నల్లూరి సుబ్బయ్య పేరుమీదే ఉన్నట్లు చూపిస్తుంది. దీని ఆసరాగా చేసుకొని సుబ్బయ్య మనవళ్లు సదరు భూమిని తమకు ఫౌతీ చేయాల్సిందిగా కోదాడ తహసీల్దార్‌ను కోరారు. ఇంకా విశేషమేమిటంటే మనవళ్లలో ఒకరు సదరు భూమిని తమ తండ్రి అమ్మాడని, తమకు అక్కడా ఎటువంటి భూమి లేదని, 35 ఏళ్ల క్రితం కొన్నవారికే చెందుతుందని రాత పూర్వకంగా రెవెన్యూ అధికారులకు రాసిచ్చాడు. తరువాత ఇతను కూడా ఒప్పుకున్నాడని అధికారులు చెప్పడం గమనార్హం.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహమే

దురాజ్‌పల్లి: సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. ఆదివారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు దొంతమల్ల రాములు, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షులు రేణుక, సహాయ కార్యదర్శి సంతోషి మాత, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, తదితరులు పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : నిరసన తెలుపుతున్న నాయకులు

• చవితి సందడి



సూర్యాపేటలో విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న వివిధ గ్రామాల ప్రజలు

భానుపురి (సూర్యాపేట) : వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఊరూ వాడా సిద్ధమవుతోంది. ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల ప్రతినిధులు ఇప్పటికే వినాయకుని విగ్రహాలు కొనుగోలు చేసి మండపాల ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం తొలి పూజలు జరగనున్న నేపథ్యంలో విగ్రహాల తరలింపు, పూజా సామగ్రి కొనుగోళ్లతో సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాలు సందడిగా మారాయి.



హుజూర్‌నగర్ : పీర్లకొట్టం యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం

సమైక్యతా సంబురం


నల్లగొండ : జాతీయ జెండాకు వందనం చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ


నల్లగొండలో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు


నల్లగొండలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు


భువనగిరి : జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, భువనగిరి డీసీపీ


సూర్యాపేట : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి


సూర్యాపేటలో జాతీయ సమైక్యతా వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


సూర్యాపేటలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


భువనగిరిలో జాతీయ సమైక్యతా వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి


స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన మునగాల మండలం గణపవరం సర్పంచ్ విజయమ్మకు అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి


టీఎల్‌ఎం కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎర్కారం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు శీనయ్యకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మంత్రి


స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన గరిడేపల్లి మండలం పొనుగోడు సర్పంచ్ సరోజనికి అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి

కాంగ్రెస్ పార్టీలో చేరిన మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆదివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మందుల సామేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు మంత్రి పదవిని త్యాగం చేసిన తెలంగాణ యోధుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ విమోచన దినోత్సవం రోజున తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషం కలిగిస్తుందన్నారు. తుంగతుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి కృషి చేస్తానని అన్నారు. తనను పార్టీలోకి ఆహ్వానించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


మందుల సామేల్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోమటిరెడ్డి

'పేట'ను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- మహిళలంతా ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే నా ఆకాంక్ష
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేటను హరిత జిల్లాగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో బెంగళూరుకు చెందిన పర్యావరణవేత్త డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఋతుప్రేమపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఋతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. స్వచ్ఛ సూర్యాపేట కోసం చేపట్టిన పవిత్రమైన యజ్ఞానంలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఆసరాగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అమలుపరుస్తున్న పథకాలను ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పల్లె దవఖానాలు, బస్తి దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పరిచి మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిరోధించడం అందరం ఆచరించాలని మంత్రి కోరారు. ప్రపంచమంతా సూర్యాపేటని చూసి నేర్చుకునే విధంగా చేస్తానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సీహెచ్ ప్రియాంక, జెడ్పీ చైర్ పర్సన్ దీపికా యుగంధర్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, పెన్‌పహాడ్ జెడ్పీటీసీ మామిడి అనిత ,చివ్వెంల ఎంపీపీ కుమారి, డిడబ్ల్యూఓ జ్యోతి పద్మ ,మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శారద, ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

నారసింహుడి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, క్యూలైన్లు, నిత్య కల్యాణ మండపం, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, దేవస్థానం బస్టాండ్‌లు భక్తులతో కిటకిటలాడాయి. ఇక శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి సుమారు మూడు గంటల సమయం, వీఐపీ దర్శనానికి సుమారు గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ.40,88, 558 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నడిగూడెం: కరీంనగర్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆదివారం నడిగూడెంలోని శ్రీ కొల్లు పాపయ్యచౌదరి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 80మంది క్రీడాకారులు హాజరుకాగా అండర్–14, 16, 18, 20 విభాగాల్లో 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అండర్ –14 బాలుర విభాగంలో హైజంప్‌లో ఎ. వరుణ్, జి. లోకేష్, షాట్‌పుట్‌లో బి. చంటి, అండర్–14 బాలికల విభాగంగా హైజంప్‌లో సీహెచ్. ప్రసన్న, బి. దీక్షిత, షాట్‌పుట్‌లో జి. విద్యావతి, అండర్–16 విభాగంలో పి. గంగోత్రి (షాట్‌పుట్, జావలిన్‌త్రో), బి. స్వరూప (డిస్క్‌త్రో, షాట్‌పుట్), జి. లోకేశ్వరి(లాంగ్‌జంప్), ఎం. అనూష (100 మీటర్ల పరుగు పందెం), తేజశ్విని (2000మీ. పరుగు), శారుణ్(హైజంప్), అండర్–16 బాలురు విభాగంలో హరిచందన్(జావలిన్‌త్రో), అండర్–18 విభాగంలో కళ్యాణి (800మీ. పరుగు), సిరిచందన(100మీ. పరుగు), లాంగ్ జంప్), అండర్–18 బాలుర విభాగంలో వంశీ (100మీ. , 200మీ. పరుగు), అండర్–20 బాలికల విభాగంలో ఉమ(3000మీ. పరుగు, 500మీ. పరుగు), అండర్–20 విభాగంలో గాంధీ(షాట్‌పుట్, డిస్క్‌త్రో) ఎంపిక చేశామన్నారు.

ఖద్దరు మాటున మోసం!

- పైరవీలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధి
- చనిపోయిన వ్యక్తి పేరిట పంట రుణం కాజేసిన ఘనుడు
- ఓ రైతుకు రెండు బ్యాంకుల్లో పంట రుణం ఇప్పించి డబ్బులు దండుకున్న వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితులు

శాలిగౌరారం: ఖద్దరు మాటున ఓ ప్రజాప్రతినిధి అటు ప్రభుత్వ సంస్థలతో పాటు అమాయకులను మోసగిస్తూ డబ్బులు దండుకుంటున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన శివరాత్రి ఇద్దయ్యకు భార్య సావిత్రమ్మ, కుమార్తె ఉన్నారు. ఇద్దయ్యకు గ్రామంలో 1.21 గుంటలు వ్యవసాయ భూమి ఉంది. అనారోగ్యంతో ఇద్దయ్య 2013లో మృతిచెందాడు. ఇద్దయ్య మృతిచెందే వరకు ఆయన ఏ బ్యాంకులోనూ పంటరుణం తీసుకోలేదు. కానీ,ఇద్దయ్యకు శాలిగౌరారం ఎస్‌బీహెచ్(నేటి ఎస్‌బీఐ)లో క్రాప్‌లోన్ ఉందని, నీవు సంతకం చేస్తే అప్పు మొత్తం మాఫీ అవుతుందని ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు ఆ పైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి నచ్చచెప్పి వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకొని బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకు సిబ్బందిని తనకు అనుకూలంగా మార్చుకున్న ఆ పైరవీకారి చనిపోయిన ఇద్దయ్య పేరుమీద పంటరుణ మంజూరీ పత్రాలపై అతడి భార్యతో వేలిముద్రలు పెట్టించి అప్పు మాఫీ జరుగుతదని చెప్పి తిరిగి ఆమెను ఇంటికి పంపించాడు. ఆ తర్వాతా చనిపోయిన ఇద్దయ్య పేరున ఆ పైరవీకారి 2015న రూ.37000లు పంటరుణం పొందాడు. గత సంవత్సరం ఇద్దయ్య పేరున బ్యాంకులో పంటరుణం ఉందని, రుణం తీర్చాలని బ్యాంకు సిబ్బంది ఇద్దయ్య భార్య సావిత్రమ్మకు చెప్పడంతో ఆందోళనకు గురైంది. బ్యాంకువారిని అడుగగా వారు రూ. 53 వేలు అప్పు ఉందని చెప్పారు. దీంతో దిక్కుతోచని ఆమె వెంటనే ఆ పైరవీకారి ఇంటికి వెళ్లి అడుగగా నాకేం తెలియదని పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. బ్యాంకు అప్పు విషయంపై బాధిత మహిళ ఇటీవల బ్యాంకు మేనేజర్‌ను కలువగా ఈనెల 19న బ్యాంకుకు రమ్మని చెప్పి పంపించారు. ఇదిలా ఉండగా ప్రజాప్రతినిధి అయిన పైరవీకారి చేసిన మరెన్నో మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాటిలో కొన్ని...

- గ్రామానికి చెందిన ఓ రైతుకు 2.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఆయన పెర్కకొండారంలోని ఏపీజీవీబీ నుంచి ఇరవై ఏళ్లుగా క్రమం తప్పకుండా పంటరుణం పొందుతున్నాడు. ఇతనికి శాలిగౌరారం ఎస్‌బీఐ బ్యాంకులో కూడా క్రాప్‌లోన్ ఇప్పిస్తానని చెప్పి 2020లో రూ.98వేలు పంటరుణం పొందాడు. ఆ రుణాన్ని ఆరైతుకు ఇవ్వకుండా అతనికి సంబంధించిన బ్యాంకు సేవింగ్ పాస్‌బుక్ తనదగ్గర ఉంచుకొని పైరవికారి ఆ డబ్బులు తీసుకున్నాడు.
- గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఎకరం భూమి ఉంటే దానిని రెండు ఎకరాలుగా జీరాక్స్‌లు తీసి శాలిగౌరారం ఎస్‌బీఐలో 2018–19లో రూ.80 వేలు రుణం ఇప్పించి బ్యాంకు సిబ్బందికి ఇవ్వాలని రూ.20 వేలు తీసుకున్నాడు.
- ఓ మహిళ తన అవసరాల కోసం బ్యాంకులో దాచుకున్న రూ. 1.25లక్షలలో రూ.లక్ష తీసుకుంటానని బ్యాంకులో విత్ డ్రా ఫాం నింపమని కోరితే 1.20లక్షలకు ఫారం రాసిచ్చాడు. అనంతరం రూ.20వేలు ఎక్కువ వచ్చాయని, బ్యాంకులో జమచేయాలని ఆ మహిళకు చెప్పి రూ.20 కాజేశాడు. కొద్ది రోజుల తర్వాత మోసం వెలుగుచూడడంతో బ్యాంకులో జమచేశానని బుకాయించడంతో బాధితురాలు లబోదిబోమంటోంది.
- గ్రామానికి చెందిన ఓ రైతుకు బ్యాంకులో రూ. 85 వేలు రుణం వస్తే రూ.60 వేలు మాత్రమే వచ్చాయని చెప్పి రూ.25 వేలు తనజేబులో వేసుకున్నాడు. తర్వాతా ఆరైతుకు బ్యాంకు అప్పు ఎంత ఉందో తెలిసేసరికి నివ్వెరపోయాడు. ఈ విషయంపై అడిగితే తనకు ఏమి తెలియదని చెప్పి పంపించాడంటూ వాపోయాడు. సదరు పైరవీకారి, ప్రస్తుత ప్రజాప్రతినిధి మోసాలపై బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఉత్సాహంగా స్పీడ్ స్కేటింగ్ పోటీలు

సాక్షి, యాదాద్రి : భువనగిరిలోని న్యూ డైమెన్షన్ పాఠశాలలో రోలర్ స్పీడ్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సువాలి ఎస్టేట్ అధినేత, చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ఫస్ట్ ర్యాంకింగ్ రోలర్ స్పీడ్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు రెండోవ రోజు ఆదివారం కొనసాగాయి. తొలిసారిగా జరుగుతున్న ఈ స్కేటింగ్ పోటీల్లో 780 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడా కారులు సెమీ ఫైనల్ వరకు చేరుకున్నారని ఆర్గనైజర్స్ తెలిపారు. కార్యక్రమంలో సువాలి ఎస్టేట్ చైర్మన్ పులిమామిడి సుభాష్ రెడ్డి, న్యూ డైమెన్షన్ పాఠశాల డైరెక్టర్ శివాణి రెడ్డి, ఇండియా స్కేటింగ్ ఫెడరేషన్ చీఫ్ భగీరథ, రాష్ట్ర అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, ఆర్గనైజర్ కోచ్ రాజు, ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


స్పీడ్ స్కేటింగ్‌లో విద్యార్థుల విన్యాసాలు

గుప్త నిధుల కోసం తవ్వకాలు

నూతనకల్: గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధులకోసం తవ్వకాలు జరిపారు. ఈ ఘటన నూతన్‌కల్ మండలం రామలింగాపురం గ్రామ శివారులోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామలింగాపురం శివారులోని పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. గమనించిన దుండగులు గుప్తనిధుల కోసం ఆలయంలోని గర్భగుడిలో తవ్వకాలు జరిపారు. అక్కడ కుండపెంకులు కన్పించడంతో దుండగులకు నిధి దొరకవచ్చునని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు ఆదివారం గమనించడంతో తవ్వకాల విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.